Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

ఆదివారం SUNDAY || 15.03.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 190 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah




## నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా
# 10 జిల్లాల ఎంపిక


**తెలంగాణ నుంచి ములుగు జిల్లాకు అవకాశం..!**

**న్యూఢిల్లీ, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభి వృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలం గాణ గ్రామీణా భివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించా రు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రెష్ సెంటర్ వర్కర్లకు రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని.. తక్కువ వేతనాల కారణంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు.



## అసెంబ్లీలో ప్రధాన సమస్యలు
# అజెండా కావాలి !

**హైదరాబాద్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 16న సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. సమస్య లు అనేకం ఉన్నాయి. సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించా లి. ప్రజల కోణంలో సమస్యలపై చర్చలు జరగాలి. అంతే తప్ప అధికార, విపక్షాల మాటల యుద్ధా నికి అసెంబ్లీ వేదిక కారాదు. తెలంగాణ ఏర్పాడి 12 ఏళ్లు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నాయ కులు బాగుపడు తున్నారే తప్ప ప్రజలు బాగు పడడం లేదు. జీతాలకు డబ్బులు లేవు. ఉన్న డబ్బులు మిత్తీలకు సరిపోవడం లేదు. ట్రిలియన్ ఎకానమీ మాటలు మాట్లాడే ముందు, అప్పలను కంట్రోల్ చేయడం, దుబారా ఖర్చులను తగ్గించడం, ఉచిత పథకాలపై సమీక్షించడం అవసరం. ఖమ్మం జిల్లా వెలుగమట్లలో అన్యాయంగా పేదల ఇళ్ళు కూల్చి వారిని రోడ్డున పడేశారు. దానికి సమాధానం చెప్పాలి.



**మెదక్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** మెదక్ జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామశివారు లో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు మృతిచెందారు. నాగరాజుకు శనివారం అంత్యక్రియలు జరగాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని ఆయన కొడుకు ధనుశ్ పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది.

# తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి

- ఇంట్లో శవం...పరీక్ష హాలులో విద్యార్థి
- మెదక్ జిల్లాలో కంటతడిపెట్టించిన ఘటన



## శక్తివంతంగా మారుతున్న
# తెలంగాణ జాగృతి

**హైదరాబాద్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతు న్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతు న్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. బీఆర్ ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లగ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం ?వుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అ టు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.



## చివరి దశకు మావోయిస్టుల
# పోరాటం

**వరంగల్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం అవిష్కృతంకానుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాట బాటలో సాగిన మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. . దశాబ్దాల కాలంపాటు అజ్ఞాతంలో ఉండి, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు అగ్రనేతలు రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత సీనియర్ నాయకులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు గంటసేపు సాగిన సమావేశంలో మావోయిస్టు నేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీ విష యం కూడా చర్చకు వచ్చింది. నాలుగున్నర దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని పోరాటం చేసిన కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జీ తిప్పిరి తిరుపతి(దేవ్‌జి),



## 3 కార్పొరేషన్లకు
# విడివిడిగా ఎన్నికలు

**హైదరాబాద్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొ దలైంది. జీహెచ్ఎం సీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావ డంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహిఁచాలని ప్రభుత్వం భావిస్తోం ది. ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహ ం ఉన్నట్లుగా చెబుతు న్నారు. ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాల నుకుంటున్నా రు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది..

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై
# అమెరికా గురి..!



**ఢిల్లీ, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** ఇరాన్‌తో యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన అమెరికా, ఇప్పుడు ఆ దేశ అగ్ర నాయకత్వాన్ని నేరుగా లక్ష్యంగా చేసుకుంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీతో పాటు పలువురు ఉన్నతాధికారుల ఆచూకీ తెలిపిన వారికి 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 92.47 కోట్లు) రివార్డు ఇస్తామని సంచలన ప్రకటన చేసింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్

### ఆచూకీ చెబితే రూ.92 కోట్లు

'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ప్రకటనను విడుదల చేసింది. మోజ్తబా ఖమేనీతో పాటు రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన కీలక సైనికాధికారులు అలీ అస్ఘర్ హెజాజీ, సెక్యూరిటీ చీఫ్ అలీ లారీజానీ పేర్లను కూడా ఈ జాబితాలో చేర్చింది. కొందరి ఫోటోలు అందుబాటులో లేకపోవడంతో వారి షాడో చిత్రాలను ప్రచురించింది.ఫిబ్రవరి 28న జరిగిన దాడిలోనే మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించగా, ఆయన కుమారుడు, ప్రస్తుత సుప్రీం లీడర్ మోజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. ఈ దాడిలో ఆయన ముఖం గుర్తుపట్టలేనంతగా మారి ఉండొచ్చని, అందుకే ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బహిరంగంగా కనిపించడం లేదని అమెరికా అనుమానిస్తోంది.

**కరీంనగర్, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి):** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం భాజపా కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుం టానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాల యం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధి లోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొ న్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది.



## బండి సంజయ్ అంజన్న
# ఆశీర్వాద యాత్ర

- కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు
- స్థానిక కార్పొరేటర్లతో కలసి పదివేలమంది నడక
- రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి
- కొండగట్టును అభివృద్ధి చేస్తామని హామీ

# దొంగతనం కేసులో 4 గురు నిందితుల అరెస్టు, రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం.



**– రాబరీ కేసు చేదించిన సూర్యాపేట జిల్లా సిసిఎస్, ఆత్మకూరు పోలీస్**

**– నలుగురు నిందితులపై తొమ్మిది కేసులు గుర్తింపు.**

**సూర్యాపేట క్రైమ్, మార్చి 14 (సూర్య సేన) :** రాబరీ కేసులో 4 గురు నిందితుల అరెస్టు చేసి, రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహా తెలిపారు. శనివారం కేసు వివరాలు అరెస్టు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నిందితులు కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేష్, షేక్ నశ్రీన్, కంచుకొమ్ముల సాయికిరణ్ ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి దొంగరించిన ఆటోలో ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వృద్ధ మహిళను బెదిరించి ఆభరణాలు దొంగలించడం, దొంగలించిన ఆటోలోనే తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనం చేస్తున్నారని పేర్కొన్నారు. సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు చెందిన వీరు ముఠాగా ఏర్పడి ఈనెల 6న ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని కోటి నాయక్ తండ శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకుని కొంత దూరము తీసుకువెళ్లి వృద్ధురాలని చంపుతామని బెదిరించి ఆమె నోరు మూసి ఆమె మెడలో ఉన్న వెండి గొలుసు దొంగలించుకొని వెళ్ళినారు. దీనిపై సంబంధిత వారు 10వ తారీఖున ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు ఇవ్వగా రాబరీ దొంగతనం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు ఆత్మకూరు పోలీసులు నేరానికి పాల్పడ్డ వారిని టెక్నాలజీ ద్వారా గుర్తించి కదలికలను గమనిస్తూ శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఆత్మకూరు మండల పరిధిలోని ఎనుబాముల గ్రామ స్టేజీ వద్ద సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఆత్మకూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు అనుమానిత వ్యక్తులు ఒక టీఎస్ 29 టీ 1190 ఆటోలో నిమ్మికల్ వైపు వెళుతున్నారు. వీరిని ఆపి తనిఖీ చేసి అదుపులోకి తీసుకోవడం జరిగింది. కోదాడ రాజీవ్ నగర్ కు చెందిన కంచుకొమ్ముల సంతోష్ ఏ1, కంచుకొమ్ముల గణేష్ ఏ2, కంచుకొమ్ముల సాయికిరణ్ ఏ4, సూర్యాపేటకు చెందిన షేక్ నశ్రీన్ ఏ3 గా గుర్తించడం జరిగింది. వీరిని విచారించగా గతములో మునగాల, సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, తిప్పర్తి, పిడుగురాళ్ల, మేళ్లచెరువు, ఫిల్మ్ నగర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్ ల పరిధిలో బంగారము ఆభరణములు, వెండి అభరణములు, వెండి వస్తువులు, ఆటోలు, మోటార్ సైకిల్, సెల్ ఫోన్ దొంగతనము చేసినామని అంగీకరించగా వారిని అదుపులోకి తీసుకొని వారి నుండి 3 లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, 5 లక్షల విలువైన 1.5 కేజీల వెండి మరియు 4 లక్షల విలువైన 3 ఆటొలు, 50 విలువైన ట్యాబ్, ల్యాప్ టాప్, 1 బైకు, 1 టీవి, 2 సెల్ ఫోన్లు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కేసు చేదనలో బాగా పనిచేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సూర్యాపేట రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, టెక్నికల్ టీం అర్ఎస్ఐ రాజశేఖర్ సిసిఎస్ పోలీస్ సిబ్బంది ఆత్మకూరు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సైలు శ్రీకాంత్, హరికృష్ణ, అర్ఎస్ఐ రాజశేఖర్, సిసిఎస్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# పది వార్షిక పరీక్షల పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్...



**సూర్యాపేట టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** పది తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాకతీయ హై స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాల నందు పరీక్షా కేంద్రాలను ఎస్పి నరసింహ ఐపీఎస్ పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా సరళిని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. పరీక్షా కేంద్రాల వద్ద నేషేద ఆజ్ఞలు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపినారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హరన్ లు ఉపయోగించ రాదని కోరారు, జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షలు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాహన పరిమితికి మించి ఎక్కువ మంది విద్యార్థులను వాహనాల్లో తరలించవద్దని కోరారు. ఎస్పి వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పట్టణ ఎస్ఐ లు ఐలయ్య, శివ తేజ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎగ్జామినేషన్ సిబ్బంది ఉన్నారు.

# మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలు సీజ్



**– మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పట్టణ ట్రాఫిక్ పోలీసులు..**

**సూర్యాపేట టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** వాహనాల తనిఖీలు, జరిమానాలు ప్రజల భద్రత కోసం రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రం 60 ఫీట్ల రోడ్డు నందు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ డ్రైవింగ్ లో భాగంగా మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేయడం జరిగిందని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలు సీజ్ నిరంతర వాహనాల తనిఖీలు, వాహనాల జరిమానాలు, ఎన్ఫోర్స్మెంట్ నిర్వహణ అనేది ప్రజల భద్రత రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనని ఎస్ఐ సాయిరాం. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ వారు ప్రమాదంలో పడడమే కాక ఎదుటివారిని కూడా ప్రమాదంలో పడేస్తారని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ అనేది చట్టాలు నేరమని పిల్లలు వాహనాలు నడుపుతూ దొరికినట్లయితే తల్లిదండ్రులపై వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మైనర్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కుకునే పిల్లలకు లైసెన్సులు కూడా రావని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు




**– ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మరియు రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. 'అరైవ్-అలైవ్' నినాదంతో సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు.

# ఒత్తిడి వద్దు ఆత్మవిశ్వాసమే హద్దు

( తెలంగాణలో 10 గాజ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా విధ్యార్తుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దృష్టితో రాసిన కవిత)

విద్యార్థి ఒత్తిడి వద్దు<br>
ఆత్మ విశ్వాసమే హద్దు<br>
విజయమే నీ పద్దు<br>
విద్యార్థి పోలికలు వద్దు<br>
స్వయం పోటీయే ముద్దు<br>
విద్యార్థి టెనేషన్ వద్దు<br>
అటెన్షన్ ముద్దు<br>
విద్యార్థి ఆందోళన వద్దు<br>
ఆలోచనే ముద్దు<br>
విద్యార్థి ఆలోచించు<br>
విశ్లేషించు<br>
విద్యార్థి స్పందించు<br>
ఆశయాలను సాధించు<br>
విద్యార్థి అద్యయనం చేయు<br>
అవగాహన పెంచుకో<br>
విద్యార్థి అభ్యసనం అలవాటైతె<br>
అనువర్తనం పరివర్తనమౌతది<br>
విద్యార్థి విశ్లేషణ వివరణ విమర్శ విస్తృతమైతే<br>
సమర్పణ సృజన సామర్థ్యాలు<br>
ఇనుమడిస్తాయి<br>
సమయ పాలన పాఠ్యాంశాలపై<br>
సాధికారిత సత్ ఫలితాలిస్థాయి<br>
విద్యార్థి షార్ట్ కట్స్ వద్దు స్మార్ట్ వర్క్ ముద్దు<br>
విద్యార్థి సృజన సన్మార్గమైతె<br>
విజయాలు సిద్ధిస్తాయి<br>
విద్యార్థి విజయ సాధన కాంక్ష<br>
నిరంతరం వెలిగే జ్యోతి కావాలి<br>
సృజనాత్మకత పట్టుదల<br>
పెట్టుబడి కావాలి<br>
విద్యార్థి పరీకల్లో కాపీ తాత్కాలిక విజయం<br>
జీవితంలో షార్ట్ కట్స్ వద్దు<br>
జ్ఞానం శీలం జీవన సాఫల్యతకు మార్గం<br>
కావాలి<br>
విద్యార్థి ఒత్తిడిని పక్కన. బెట్టు<br>
చదువు పై దృష్టి పెట్టు<br>
తల్లి తండ్రులు పాజిటివ్ దృక్పథం తో విద్యార్థి<br>
లక్ష్య సాధనకు సహకరించాలి<br>
పిల్లలపై భారీ అంచనాలు వద్దు<br>
నచ్చిన రంగాల్లో రాణించేట్లు విద్యార్థి<br>
మనసును ఎరిగి టీచర్స్ బోధించాలి<br>
ప్రోత్సహించడమే ముద్దు<br>
విద్యార్థి మనోప్రశాంతత ఆత్మవిశ్వాసం<br>
ప్రతిభా పాటవాలకు ఉద్దీపనం కావాలి<br>
యావరేజే అద్భుతాలకు ఆలంబన కావాలి<br>
విద్యార్థి ఆత్మన్యూనత విడనాడాలి<br>
నైపుణ్యాభివృద్ధితో శ్రమయేవ జయతే జీవన<br>
శైలి కావాలి<br>
విద్యార్థి రాంకుల కొరకు పరుగు వద్దు<br>
రాణింపే మంత్రం కావాలి<br>
పఠనాసక్తే తంత్రం కావాలి<br>
వివేచన విచక్షణ యంత్రం<br>
కావాలి<br>
సమయ పాలనతో స్వావలంభన<br>
సమయాన్ని సృజనను సన్మార్గంలో పెడితే<br>
అద్భుతాలు ఆవిష్కృతమౌతాయి<br>
విద్యార్థి జీవిత కాల చక్రంలో వచ్చే<br>
మార్పులను ప్రతిభను గుర్తిస్తే విజయాలు<br>
రాజ్యమేలుతాయి<br>
విద్యార్థి ఆన్లైన్ గేమ్స్<br>
సోషల్ మీడియా వద్దు<br>
సోషలైజేషన్ హద్దు<br>
పుస్తకాలకు దగ్గరగా<br>
గ్యాడ్జెట్స్ రహితంగా<br>
ప్రతి ఇల్లు టెక్నాలజీ ఫ్రీ జోన్<br>
కావాలి<br>
గ్యాడ్జెట్ల బానిసత్వం వద్దు<br>
టెక్నాలజీ ఉపవాసం ముద్దు<br>
జీవితంలో ఉల్లాసం ఉత్సాహం ఉప్పొంగాలి<br>
మాతృబాషపై మమకారం<br>
ప్రాంతీయ భాషపై ఆసక్తి<br>
ప్రాచీన భాషలపై అభిమానం భారతీయ<br>
సంస్కృతి చరిత్ర వారసత్వ సంపదపై<br>
అవగాహన చైతన్యం పెంచుకొని భారత జాతి<br>
ప్రతిభా ఔన్నత్యాన్ని<br>
ప్రపంచానికి చాటాలి<br>
విశ్వ విజేతలుగా నిలువాలి<br>
జగతిన వెలుగులు నింపాలి



**నేదునూరి కనకయ్య**<br>
**అద్యక్షులు తెలంగాణ**<br>
**ఎద్యుకేషన్ ఫోరం**<br>
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**<br>
**కరీంనగర్ 9440245771**

# పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి



**– ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 18వ వార్డులో శుభ్రత కార్యక్రమం**

**– కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్**

**సూర్యాపేట టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి రహదారులను శుభ్రం చేయించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సక్రమంగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. అలాగే ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి ఇవ్వడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుందని చెప్పారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాలోత్ కమల చంద్రు నాయక్ మున్సిపల్ వార్డు అధికారి నాగార్జున , స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బుకింగ్ తో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్

సూర్యాపేట క్రైమ్, మార్చి 14 (సూర్య సేన): గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ అన్నారు. నకిలీ వాట్సాప్/ఎస్ఎంఎస్ లింకులు, తక్షణ డెలివరీ ఆశ చూపి అడ్వాన్స్ డబ్బులు అడగడం, కేవైసీ అప్‌డేట్ పేరుతో ఓటిపి అడగడం వంటివి మోసపూరిత చర్యలలో నేరగాళ్ళు నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి, తెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్యాస్ కొరత ఉందని, వెంటనే బుక్ చేసుకోండి" అని వచ్చే సందేశాలు లేదా వాట్సాప్ లింక్‌లను నమ్మవద్దని, ఇవి వ్యక్తిగత వివరాలను, డబ్బును దొంగిలించడానికి పన్నే పన్నాగంగా గ్రహించాలన్నారు.

అదేవిదంగా గ్యాస్ సిలిండర్ డెలివరీకి ముందు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ పేమెంట్ చేయమని కోరితే అది మోసమని గ్రహించాలని, ఓటిపి/యూపీఐ పిన్ షేర్ చేయవద్దని, కేవైసీ అప్‌డేట్ లేదా సబ్సిడీ పేరుతో ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి, బ్యాంక్ వివరాలు, లేదా యూపీఐ పిన్ అడిగితే అస్సలు చెప్పకూడదన్నారు. గ్యాస్ సిలిండర్‌ను అధికారిక మొబైల్ యాప్‌లు, ఏజెన్సీ వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ మోసపోతే, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని, cybercrime.gov.in లో రిపోర్ట్ చేయాలన్నారు.



# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు....



**సూర్యాపేట టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని బి ఆర్ఎస్ పార్టీ ఏడవ వార్డు కౌన్సిలర్ ఈద ప్రవీణ్ అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రం ఏడో వార్డు లో మాజీమంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు ముస్లింలకు స్థానిక కౌన్సిలర్ ఈద ప్రవీణ్ ఆధ్వర్యంలో సహాబా మసీద్ లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని రోజా విరమించే సాయంత్రపు భోజనాన్ని ఇఫ్తార్ విందు అంటారని,ఇది ఖర్జూరాలు,నీరు లేదా పండ్లతో మొదలై సాంప్రదాయ వంటకాలతో కూడిన రుచికరమైన విందుగా మారుతుందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు సమాజంతో కలిసి భోజనం చేయడం, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌల్ సాబ్ మౌలానా అక్రం, కాంట్రాక్టర్ జలీల్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు గౌస్,ధైద కృష్ణ,రఫీ,హుస్సేన్, సాదక్ అలీ సాబ్, అస్సాన్, యాసిన్, యాకూబ్, ఇమామ్, జానపాటి నరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన, పట్టణ ప్రణాళిక లో భాగంగా నర్సరీ సందర్శన



**– మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత**

**సూర్యాపేట టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** నర్సరీలో మొక్కల్ని జాగ్రత్తగా పెంచాలని మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. శనివారం సూర్యాపేట మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని ప్రజాపాలన పట్టణ ప్రణాళిక లో భాగంగా శ్లోక స్కూల్ సమీపంలో గల మున్సిపాలిటీ నర్సరీని మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల గురించి మున్సిపల్ సిబ్బంది ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నెల నుంచి ఇంటింటికి మున్సిపాలిటీ ద్వారా పూలు, పండ్ల మొక్కలు సరఫరా చేస్తామని అన్నారు. ప్రజలు మొక్కలను తమ ఇంటి ఆవరణలో పెంచుకోవాలని,ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని ఆమె అన్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఒక లక్ష 81 వేల మొక్కలు పెంచుతున్నామని, ఇంకా తొమ్మిది నర్సరీ లలో మూడు లక్షల వరకు మొక్కలను పెంచుతామని తెలిపారు. జూన్ నెలలో ప్రారంభమయ్యే వర్షాకాలంలో ఈ మొక్కలను ప్రజలకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, స్థానిక కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్,శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్,టిపివొ సోమయ్య,ఏఈ రాజిరెడ్డి, శివప్రసాద్,వసీమ్,తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ -- 20 ద్విచక్రవాహనాలు సీజ్



**సూర్యాపేట / చివ్వేంల, మార్చి 14 (సూర్య సేన):** మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు చివ్వెంల పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలోని మూసి కాలువ వద్ద శనివారం పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మైనర్లు నడుపుతున్న 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ తెలిపారు. వాహనాల తనిఖీలు, జరిమానాలు విధించడం ప్రజల భద్రత కోసం మరియు రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. చిన్న వయసులో వాహనాలు నడిపే పిల్లలు అజాగ్రత్తగా వ్యవహరించి తాము ప్రమాదంలో పడటమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులు మరియు వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కుకునే వారికి భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందే అవకాశం ఉండదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ--2 ఆర్. కనకరత్నం మరియు స్టేషన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో 'తేజ' విద్యార్థుల ప్రతిభ



**- దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో 18 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్**

**కోదాడ ప్రతినిధి, మార్చి 14 (సూర్యసేన) :** న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ (ఎస్ఓఎఫ్) దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలను నిర్వహిస్తోంది. 2025--26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ఈ పరీక్షల్లో పట్టణ పరిధిలోని తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 18 మంది బంగారు పతకాలను సాధించారు. 6వ తరగతి విద్యార్థులైన హర్షవర్ధిని, అక్షర రెడ్డి, ధృవ, సాత్విక్ రెడ్డి, జునైద్, శ్రీ లక్ష్మి సంతోషి గోల్డ్ మెడల్స్ సాధించారు. 7వ తరగతి నుండి సహస్ర, వీక్ష సహస్ర, దిశిత, నిత్యశ్రీ, వెంకట శ్లోక ప్రతిభ కనబరిచారు. 8వ తరగతి విద్యార్థులైన భాగ్యశ్రీ, భాను తేజ్, భువనేశ్ కూడా గోల్డ్ మెడల్స్ సాధించగా, 9వ తరగతి విద్యార్థులు అఫ్నాన్, రేఖశ్రీ, శ్రేష్ట, శివరామకృష్ణలు మెరిశారు. పరీక్షలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ధృవీకరణ పత్రం మరియు పరీక్ష విశ్లేషణ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి విద్యార్థులను అభినందించారు. అకడమిక్ సహాయకులు జోస్ సామ్యూల్‌తో పాటు గణిత, సైన్స్ అధ్యాపకులు ఉపేందర్, బ్రహ్మారెడ్డి, రామకృష్ణ, మురళీకృష్ణ, ఉస్మాన్ పాషా, యాసిన్ అహ్మద్, విజయసాగర్, స్ఫూర్తి, తయ్యబా బేగం విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు తెలిపారు.

# తాగునీటి ఎద్దడి పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలి



**- సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**

**నేరేడుచర్ల ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) :** జిల్లాలో తాగునీటికి సాగునీటికి ఇబ్బంది రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు శనివారం ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ....

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటికి ఎద్దడి రాకుండా చూడాలని ఈ ప్రాంతంలో ఉన్న అన్ని చెరువులను నింపాలని చేపలు పట్టే వంకతో కాంట్రాక్టర్లు చెరువులు ఖాళీ చేయకుండా చూడాలని ఎవరైనా రాత్రివేళలో దొంగతనంగా చెరువులు ఖాళీ చేపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ యాసంగి పంటకు చివరి భూములకు నీరు అందేలా చూడాలని పొలాలు ఈ నెలాఖరు వరకు కోతకు వస్తాయని ఇప్పుడు నీరు చాలా అవసరం కాబట్టి ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణలో నీరు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఒకపక్క తాగునీరు మరోపక్క సాగునీరుకు ఆటంకం జరగకుండా చూసుకోవాలని ముఖ్యంగా ఇరిగేషన్ మినిస్టర్ ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉండటం వల్ల అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకపక్క పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణంవల్ల ప్రజలకు గ్యాస్ తో పాటు నిత్యవసర వస్తువులు కూడా అందుబాటులోకి లేక అధిక ధరలతో అల్లాడుతున్నారని అలాంటి ఈ సందర్భంలో తాగేందుకు ప్రజలకు నీళ్ళు దొరికేలా చర్యలు తీసుకోవాలని ఎల్ నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షాలు పడే పరిస్థితి లేదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని అందువల్ల ఏ ఏ ప్రాజెక్టులో ఎంత నీరు ఉన్నదో తెలుసుకొని తాగునీటి చెరువులను నింపి రిజర్వాయర్ నింపి ప్రజలను పశుపక్ష్యాదులను ఆదుకోవాలని ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. లక్ష్మి,, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ బీసీ హక్కుల సాధన సమితి పట్టణ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు

# యువతను ఏకం చేయడంలో కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ పాత్ర ప్రశంసనీయం

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి**

**రంగారెడ్డి, మార్చి 14 (సూర్య సేన) :** యువతను ఏకం చేయడంలో రామకృష్ణాపురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక ఉపేందరరెడ్డిపాత్ర ప్రశంసనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు . శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకా ఉపేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు . చిలుకా ఉపేందర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరెన్నో ఉన్నతపదవులుఅధిరోహించాలని ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని కోరారు .పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా నాయకుడిగా ఆయన సేవలు మహేశ్వరం నియోజకవర్గానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండి



మధుసూదన్ రావు, తలాటిరమేష్ నేత, కానాల శ్యాంసుందర్రావు, సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్,శేఖర్ ముదిరాజ్,పగడాల శ్రీశైలం, కళ్యాణ్ యాదవ్, రామారావు, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, పెద్దవూర సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 17న మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

**కోదాడ ప్రతినిధి, మార్చి 14 (సూర్యసేన) :** తెలంగాణ రాష్ట్ర



స్పోర్ట్స్ స్కూల్స్‌లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పరీక్షలు ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు కోదాడలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సలీం షరీఫ్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్, హన్మకొండలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం ఈ ఎంపికలు నిర్వహించనున్నారు. వెబ్‌సైట్ (http://tgss.telangana.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్న బాలబాలికలకు మండల స్థాయి ఎంపికలో భాగంగా హైట్, వెయిట్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6ఐ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ వంటి మొత్తం తొమ్మిది మోటార్ క్వాలిటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను జిల్లాస్థాయి ఎంపికలకు పంపిస్తామని పేర్కొన్నారు. 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించిన నాలుగో తరగతి విద్యార్థులు మాత్రమే ఈ ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ కె. సునీల్ కుమార్ 8500712573 ను సంప్రదించాలని కోరారు.

# బూరుగడ్డలో సహస్రనామ ఫల పుష్పార్చన



**హుజూర్నగర్ ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) :** బూరుగడ్డలోని శ్రీ ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ప్రతి నెల బహుళ ఏకాదశి సందర్భంగా నిర్వహించే సహస్రనామ ఫల పుష్పార్చన కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈరోజు ఫల పుష్పార్చన కార్యక్రమాన్ని బూరుగడ్డ వాస్తవ్యులు కొత్త శ్రీనివాసరావు -- శైలజ దంపతులు నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా అన్నదానాన్ని మిర్యాలగూడకు చెందిన ఓరుగంటి విజయ ప్రకాష్ -- రాధిక దంపతులు తమ కుమార్తెలు శ్రియ, శ్రీజలతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముదుంబై హరీష్ కుమారాచార్యులు, యరగానీ బిక్షం, యరగానీ గురవయ్య, కొత్తా ప్రవీణ్ కుమార్, కొత్తా రవి, గడ్డం నాగయ్య, బాలబోయిన వెంకన్న, లక్ష్మీనారాయణ, మంచాల లక్ష్మయ్య -- సరస్వతి దంపతులు, గోవిందరావు -- మహాలక్ష్మి, రాచమళ్ళ వెంకటయ్య -- పుష్పలత, మంత్రిప్రగడ లీలావతి, లక్ష్మి, పుష్ప, అనసూర్య, సంధ్యా, సరితా, ప్రసన్న, కవిత తదితరులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది వై కిరణ్ గౌడ్, వై రమేష్, వై ఉపేందర్ సేవలందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.

# కోదాడలో ప్రశాంతంగా పదో తరగతి తెలుగు పరీక్ష......

**- ఒక్క విద్యార్థి గైర్హాజరు**

కోదాడ ప్రతినిధి, మార్చి 14 (సూర్యసేన) : పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ సలీం షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 11 పరీక్ష కేంద్రాలకు 2,441 మంది విద్యార్థులు ఎలాట్ కాగా, 2,440 మంది హాజరై పరీక్ష రాశారని, ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరైనట్లు వెల్లడించారు. తేజా స్కూల్‌లో 174 మంది ఎలాట్ కాగా అందరూ హాజరయ్యారు. బాయ్స్ జడ్పీహెచ్ఎస్‌లో 229 మంది విద్యార్థులు ఎలాట్ కాగా అందరూ పరీక్ష రాశారు. శ్రీ చైతన్య శ్రీనగర్ కాలనీ కేంద్రంలో 239 మంది ఎలాట్ కాగా 238 మంది హాజరై ఒకరు గైర్హాజరయ్యారు. ఇతర కేంద్రాల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో 192 మంది, ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో 240 మంది, సిటీ సెంట్రల్ స్కూల్‌లో 240 మంది, కేటీఎస్ స్కూల్‌లో 239 మంది, సీసీ రెడ్డి స్కూల్‌లో 230 మంది, ఎస్‌వీ స్కూల్‌లో 198 మంది, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్‌లో 230 మంది, శ్రీ వైష్ణవి స్కూల్‌లో 230 మంది ఎలాట్ కాగా అందరూ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. అదేవిధంగా కేటీఎస్ స్కూల్‌లో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు 7 మంది విద్యార్థులు ఎలాట్ కాగా 6 మంది హాజరై ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# గృహ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి




సూర్యాపేట, మార్చి 14 (సూర్యసేన): గృహ కార్మికుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి అని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ కాస అనసూర్య ప్రభుత్వని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నెంబర్ 2 స్కూలు వద్ద పార్కులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 11 లక్షల మంది గృహ కార్మికులు, సూర్యాపేటలో 2000 పైగా గృహ కార్మికులు ఉన్నారని అన్నారు. వారికి సరైన జీతం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గృహ కార్మిక మహిళలకు సామాజిక భద్రత కూడా లేదు అని అన్నారు. గృహ కార్మికులకు సరైన గుర్తింపు, గౌరవం కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గృహ కార్మికులు అందరూ కలిసి ర్యాలీగా వెళ్లి సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డ్స్ ను పంపించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు నీలిమ, ఉపాధ్యక్షురాలు పాల్వాయి సుహాసిని, సెక్రటరీ నిమ్మల దివ్య, జాయింట్ సెక్రెటరీ ఎన్ లక్ష్మి, కోశాధికారి ఎన్ భావన, గృహ కార్మిక సభ్యులు నిర్మల, జానకి, అరుణ, ఉప్పమ్మ, ప్రసన్న, ప్రమీల, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య....



**కోదాడ ప్రతినిధి, మార్చి 14 (సూర్యసేన) :** కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలంలో పలువురి కుటుంబాలను కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శనివారం పరామర్శించారు. మండలంలోని రామచంద్రనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బుడిగం సత్యం తల్లి భద్రమ్మ మృతిచెందడంతో వారి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. జేర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు చవ్వ మల్లయ్య అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన ఎంఎంఎఫ్ మేము సైతం ఫౌండేషన్ సలహాదారు షేక్ నాగుల్ పాషా తల్లి మహబూబి మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం చిలుకూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మల్లం వెంకటేశ్వర్లు తల్లి సైదమ్మ ఇటీవల మృతిచెందడంతో మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు

# స్వచ్ఛత సైనికులుగా మారాలి...




సూర్యాపేట, మార్చి 14 (సూర్యసేన): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛత సైనికులుగా మారాలని 43వ వార్డు కౌన్సిలర్ బత్తుల ఝాన్సీ రాణి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 43వ వార్డుల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులో వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తడి పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని అన్నారు. తడిచెత్తను కంపోస్టు ఎరువుగా రీసైక్లింగ్ చేయడానికి కూరగాయల వ్యర్థా లను డబ్బాల్లో ఉంచి పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని కోరారు. చెత్తను డ్రైనేజీ మోరీ బహిరంగ ప్రదేశాలలో పడేయడం వల్ల దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి యశోద, వార్డు ఆఫీసర్ రవితేజ, జవాన్ శ్రీనివాస్, మిన్నయ్య, మున్సిపాలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

ఆదివారం, మార్చి 15, 2026

# భారత్ బిగ్ డీల్..!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచం లో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు మాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్?యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉ ంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. ఇది ఉమ్మడి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తూ, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్?ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇప్పుడు అమెరికా కుళ కుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా?ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించార. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య పోటీతత్వాన్ని, భౌగోళిక రాజకీయాల ప్రభావాన్ని సూచిస్తోంది. ఈ ఒప్పందం ఈయూ? భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు. అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మొత్తంగా, ఈ డెవలప్‌మెంట్ భారత్ గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది, ఇతర దేశాలు కూడా భారత్‌వైపు చూసేలా చేస్తుంది. మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20?30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి. ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు. ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. యూరప్ నుంచి టెక్నాలజీ, మెషినరీ దిగుమతులు పెరిగి, భారత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. భారత్ నుంచి ఐటీ, ఆటో పార్ట్స్ ఎగుమతులు పెరిగి, సరఫరా బలపడుతుంది. అయితే, స్థానిక ఉత్పాదకులు పోటీకి సిద్ధంగా ఉండాలి. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం గురించి అందరికీ తెలిసిందే. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు భారత ప్రధాని మోదీతో మంచి స్నేహ సంబంధాలను నెరిపారు.

సూర్యసేన


దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048

# బహుళ ప్రయోజనాల ఒప్పందం!

ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్నది. అంతే గాకుండా సామ్రాజ్య విస్తరణ కాంక్ష పెరుగు తోంది. సొంతదేశం అమెరికాలోనే ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఓ వైపు టారిఫ్‌లు మరోవైపు వీసాల కట్టడితో భారత్ లక్ష్యంగా ట్రంప్ పరోక్ష యుద్ధం మొదలు పెట్టాడు. ఒకవైపు ట్రంప్ టారిఫ్‌ల దూకుడు, మరోవైపు చైనా ఆధిపత్యం, కీలక ఉత్పత్తుల సరఫరాలపై నియంత్రణలతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈయూ-భారత్ ఒప్పందంతో అటు అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడం, ఇటు చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడం సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై 2007లో చర్చలు మొదలయ్యాయి. వివిధ కారణాలతో మధ్యలో నిలిచిపోయాయి. అంటే గత యూపిఎ హయాంలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పుకోవాలి. తిరిగి 2022లో చర్చలు ప్రారంభమయ్యాయి. మొత్తంగా రెండు దశాబ్దాల అనంతరం ఒప్పందం కుదిరింది. గ్రీన్‌లాండ్ అంశంలో ట్రంప్ వ్యవహారశైలి, అమెరికా లేకుంటే యూర్‌పను ఎవరూ పట్టించుకోబోరన్న వ్యాఖ్యలు, టారిఫ్ విధిస్తానంటూ బెదిరించడం తో.. ఆగ్రహంతో ఉన్న ఈయూ భారత్‌తో ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసింది. ఈక్రమంలో భారత్ ఆచితూచి మసలు కుంటోంది. ప్రపంచ దేశాలతో సయోధ్యకు యత్నిస్తోంది. కొందు చెప్పినట్లుగా అమెరికాను ఎదరించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. ఎందుకంటే మన వాణిజ్యానికి తోడు, మన దేశీయులు లక్షల్లో అక్కడ ఉన్నారు. వారి ప్రయోజనాలు కూడా ముఖ్యం. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మోడీని విమర్శించడమే లక్ష్యంగా మన విదేశాంగ విధానంపై దుమ్ము పోస్తున్నారు. కానీ ఇది సరైన విషయం కాదు. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎడారిలో ఒయాసిస్సు లాంటిది. వాణిజ్యం కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, ఇతర మార్కెట్లను అందిపుచ్చు కోవడం దిశగా భారత్ ముందడుగు వేస్తున్న క్రమంలో కొత్తవాణిజ్య ఒప్పందం ఓ పెద్ద ముందడుగా భావించాలి. యూరప్ దేశాలకు ఎగుమతి చేసే చాలా రకాల ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా తొలగి పోనున్నాయి. దీనితో భారత వ్యాపారులు, ఎగుమతిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగనుంది. యూరప్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, వైన్స్, అత్యవసర ఔషధాలు వంటి వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. యూరోపియన్ యూనియన్,భారత్ మధ్య భారీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' గా అభివర్ణించవచ్చు. ఇటు భారత్‌లోని 140 కోట్ల మంది, ఈయూలోని కోట్లాది మంది ప్రజలకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. భారత్, ఈయూ ఉమ్మడి జీడీపీ ప్రపంచ జీడీపీలో 25శాతం. ఇది ప్రపంచ వాణిజ్యంలో మూడోవంతుతో సమానం అనిప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన 27 దేశాల్లో ఈ ఒప్పందంపై చట్టాలుచేసిన త ర్వాత పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఇందు కోసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, భారత్-ఈయూ సదస్సులో భాగంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాలతో ప్రధాని మోదీ భేటీ అయి.. వాణిజ్యంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తోపాటు మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే ఐదేళ్లకు సంబంధించిన ఉమ్మడి వ్యూహాత్మక ఎజెండాను ఆమోదించారు. నిజానికి ఇదో పెద్ద ముందడుగుగా భావించాలి. భారత్ వేస్తున్న అడుగులను ట్రంప్ కూడా గమనిస్తున్నారు. బెదరింపు ధోరణులతో భారత్‌ను కట్టడి చేయడం సాధ్యంకాదని ఈ ఒప్పందంతో అర్థం కానుంది. ముఖ్యంగా భారత్ వస్తువులకు మార్కెట్ అవసరం. అది ఇప్పుడు కొంత తీరనుంది. 2030 నాటికి భారత్, ఈయూ మధ్య వాణి జ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ బలోపేతం చేసేందుకు.. ఉమ్మడి సమగ్ర, వ్యూహాత్మక ఎజెండాను అనుసరించాలని నిర్ణయించారు. ఇది యూరప్ దేశాల్లో భారత యువత ఉద్యోగాలు,విద్య, పరిశోధన రంగాల్లో మంచి అవకాశాలు పొందేందుకు కూడా తోడ్పడనుందని విశ్లేషణలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం పొడిగింపు, గ్రీన్ హైడ్రోజన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, రహస్య సమాచారం పరస్పర మార్పిడి ఒప్పందంపై చర్చలు చేపట్టడంపైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కార్ల దిగుమతిపై భారత్ యూరోపియన్ యూనియన్‌పై ఆధారపడుతోంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం 125శాతం వరకు సుంకాలు ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం కార్లపై సుంకాలు 40శాతానికి తగ్గుతాయి. తర్వాత దశలవారీగా 10శాతానికి తగ్గిస్తారు. దీనితో యూర్‌పకు చెందిన బీఎండబ్ల్యూ, ఆడి, మెర్సిడెజ్, లాంబోర్గిని, పోర్షే వంటి కార్ల ధరలు భారీగా తగ్గుతాయి. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసేకార్లపైనా అక్కడి సుంకాలను10శాతానికి తగ్గిస్తారు. ఇది భారత కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఇలా పరస్పరం సుంకాల మినహాయింపు వల్ల మన ఉత్పత్తుకు కూడా ఎగుమతి మార్కెట్ లభిస్తుంది. ఇకపోతేయూరప్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే వైన్, విస్కీ,వోడ్కా,బీర్ వంటివాటిపై 150శాతంవరకు దిగుమతి సుంకాలుఉన్నాయి. క్యాన్సర్ ఔషధాలు,బరువు తగ్గించే మందులు సహాకీలక ఫార్మా ఉత్పత్తుల ధరలు 11 శాతం వరకు, వైద్య పరికరాలు ధరలు 25శాతం వరకు తగ్గుతాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాల ధరలు తగ్గడం వల్ల దేశంలో ఫార్మా కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. విమానాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై భారత సుంకాలు తగ్గుతాయి. దీనితో యూరప్ నుంచి వచ్చే సంబంధిత ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ఇక భారత్ నుంచి యూరప్ దేశాలకు వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఆభరణాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. బిస్కట్లు, పాస్తా,చాకోలెట్లు, పండ్ల రసాలు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్, ఇతర నూనెలపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. నిజానికి ఇదో పెద్ద విజయంగా, కీలక పరిణామంగా చూడాలి. ప్రపంచంతో పోటీపడి మన ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల బెడద నుంచి ఉపశమనానికి ఈ ఒప్పందం కీలకం కానుందనడంలో సందేహం లేదు.

# మైక్రోప్లాస్టిక్‌తో త్వరగా వృద్ధాప్యం ..!





**ఆరోగ్యం : మైక్రోప్లాస్టిక్ పర్యావరణానికే కాదు, మనిషి ఆరోగ్యానికి కూడా పెను ప్రమాదంగా మారింది. మీకు తెలుసా ? గుండెపోటుకు మైక్రోప్లాస్టిక్‌కు సంబంధం ఉంది..! అంతేకాదు.. మనిషిని త్వరగా వృద్ధాప్యంలోకి తీసుకెళుతుంది..!**

మైక్రోప్లాస్టిక్ అంటే ?: మైక్రోప్లాస్టిక్ అంటే చిన్న ప్లాస్టిక్ ముక్కలు.. దాని పొడవు 5 మిల్లీ.మీటర్ల కన్నా తక్కువ..! ఇది మన పర్యావరణంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ఫలితం..! మేకప్ ఐటమ్స్, ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ బ్యాగులు, సింథటిక్ వస్త్రాలలో మైక్రోప్లాస్టిక్స్ ఉంటాయి. ఇవన్నీ మనం పారేసే చెత్త ద్వారా ప్రయాణించి పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి.

ప్రైమరీ, సెకండరీ : ఈ అతిచిన్న ప్లాస్టిక్ ముక్కలు ప్రైమరీ, సెకండరీలుగా విభజింపబడ్డాయి. ప్రైమరీ మైక్రో ప్లాస్టిక్స్ ఉద్దేశపూర్వకంగా తయారయ్యాయి. వీటిని వేరే వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. బట్టలు, టైర్లు, మేకప్‌ల తయారీలలో వాడతారు. ఇక సెకండరీ మైక్రో ప్లాస్టిక్స్.. అత్యధికంగా మనకు కనిపిస్తాయి. పెద్దగా ఉండే ప్లాస్టిక్‌లు, ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ కుర్చీలు, ఫర్నీచర్ సామాగ్రిని తయారు చేయడానికి వాడతారు. వీటిని సరిగ్గా పారేయకపోతే.. సూర్యకాంతి, ఆక్సిజన్‌లు కలిసి ప్లాస్టిక్‌ను బలహీనం చేస్తాయి. అవి చిన్నచిన్నవిగా విడిపోయి మైక్రో ప్లాస్టిక్‌గా మారతాయి. వీటిని సెకండరీ మైక్రో ప్లాస్టిక్ అంటారు. ప్లాస్టిక్ డీకంపోజ్‌కు 100 సంవత్సరాలు పడుతుందని మనం తరచుగా వింటుంటాం. అయితే ఈ ప్లాస్టిక్ మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. జీర్ణాశయం పేగులలో చేరడం, టాక్సిక్ కెమికల్స్‌ను మన జీర్ణాశయంలో పంపడం, కణాలను దెబ్బతీయడం, మైక్రో బాక్టీరియా అంతరాయం, ఊపిరితిత్తుల సమస్యలు, బ్లడ్, బ్రెయిన్, నరాల సమస్యలు వస్తాయి. అందువల్ల ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం చాలా కీలకం. అవసరం.

వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తున్నాయి: శరీరంలోని ధమనుల నుంచి మెదడు, చివరికి పిండం వరకు చేరిన ఈ చిన్న కాలుష్య కణాలు, కణాలపై ఒత్తిడి పెంచి, అవయవాల పనితీరును దెబ్బతీసి, జీవసంబంధిత వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తున్నాయని ఒక డాక్టర్ తన వీడియోలో హెచ్చరించారు. మైక్రోప్లాస్టిక్స్.. ఈ చిన్న కణాలు కేవలం పర్యావరణంలో కాలుష్యంగా మిగిలిపోవడం లేదు. అవి మనిషి శరీరంలోకి సైతం చొరబడి ఆరోగ్యంపై, జీవితకాలంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది. ప్లాస్టిక్ విచ్ఛిన్నం అయినప్పుడు ఏర్పడే ఈ సూక్ష్మ కాలుష్య కణాలు, మానవ ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలను చూపిస్తున్నాయని కొత్త అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇంటర్వెన్షనల్ పెయిన్ మెడిసిన్ ఫిజీషియన్ అయిన డాక్టర్ కునాల్ సూద్ ఈ సమస్య తీవ్రతను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వీడియో (అక్టోబర్ 21) ద్వారా వెల్లడించారు. మైక్రోప్లాస్టిక్స్‌కు, మానవ వృద్ధాప్యానికి మధ్య ఉన్న లింక్‌ను ఆయన నొక్కి చెప్పారు. "మైక్రోప్లాస్టిక్స్ అనేది కేవలం పర్యావరణ సమస్య కాదు" అని డాక్టర్ సూద్ స్పష్టం చేశారు.



ధమనుల నుంచి మెదడు వరకు.. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ !: మైక్రోప్లాస్టిక్స్ ఇప్పుడు కేవలం పర్యావరణానికే పరిమితం కాలేదనే విషయాన్ని డాక్టర్ సూద్ ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈ మైక్రోప్లాస్టిక్‌లను మనుషుల ధమనుల్లో, మెదడు కణజాలంలో, చివరికి గర్భధారణ సమయంలో మావిలో కూడా గుర్తించారు" అని ఆయన తెలిపారు. తాజాగా జరిగిన పరిశోధనలు ఈ భయంకరమైన వాస్తవాన్ని నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కాలుష్య కణాలు శరీరంలోని కణాలపై ఒత్తిడి పెంచుతున్నాయని, ఇది వేగవంతమైన వృద్ధాప్యానికి దారితీస్తుందని సూద్ వివరించారు. ముఖ్యంగా గుండె, మెదడుకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు కూడా ఇవి కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. "మీ కణాలు, అవయవాలు కాలంతో పాటు ఎంత బాగా పనిచేస్తాయనే జీవసంబంధిత వృద్ధాప్యానికి ఈ ప్లాస్టిక్ కణాలు ఆటంకం కలిగిస్తున్నాయి. అవి కణాలపై ఒత్తిడి పెంచి, వాటి శక్తి సరఫరాను దెబ్బతీస్తాయి. కొన్నిసార్లు కణాలు సాధారణం కంటే త్వరగా పనిచేయడం ఆపేసేలా చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి" అని డాక్టర్ సూద్ వివరించారు.

గుండెపోటు, స్ట్రోక్‌కు మైక్రోప్లాస్టిక్సే కారణమా ?: కణాల నష్టం, శక్తి సరఫరాకు ఆటంకం కలిగించడంతో పాటు, గుండె, మెదడు ఆరోగ్యంపై కూడా మైక్రోప్లాస్టిక్స్ ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని డాక్టర్ సూద్ తెలిపారు. "ఒక అధ్యయనం ప్రకారం, ధమనుల ఫలకా లలో ప్లాస్టిక్ శకలాలుఉన్న వ్యక్తులలో గుండెపోటు,స్ట్రోక్‌వచ్చే ప్రమా దం, లేదా త్వరగా మరణించే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తేలింది" అని ఆయన పేర్కొన్నారు. మైక్రోప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యం, వఅద్ధా ప్యంపై పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ, ఈ చిన్న కాలుష్య కణాలు మనిషి శరీరం వృద్ధాప్యం చెందే విధానాన్ని నిశ్శబ్దంగా మార్చేస్తున్నాయని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



# కల్మలచెరువు "అయ్యప్పస్వామి" దేవస్థానములో సంప్రోక్షణ కార్యక్రమం.....



**గరిడేపల్లి, మార్చి 14 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, కల్మలచెరువు గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ఉదయం దేవాలయ అర్చకులు వంగీపురం వినయ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఆలయంలో దొంగతనం జరిగిన కారణంగా.. హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం కల్మలచెరువు గ్రామంలో శనివారం తెల్లవారుజామున హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానము కల్మలచెరువు దేవస్థానం చైర్మన్ పరిక లక్ష్మయ్య మరియు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు అభిషేక కార్యక్రమాలు మరియు స్వామివారి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు కమిటీ సభ్యులు గురు స్వాములు గ్రామ పెద్దలు అందరు విచ్చేసి సంపక్షణ కార్యక్రమాన్ని తిలకించినారు స్వామివారి తీర్థ ప్రసారాలు స్వీకరించినారు స్వామి వరకు కృపకు పాత్రులు అయ్యారు ఆశీర్వాదం తీసుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పరికె లక్ష్మయ్య కమిటి సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో అడ్మిషన్లు నమోదుకు అవకాశం



**సూర్యాపేట, మార్చి 14 (సూర్య సేన) :** కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ 2026 – 27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు అడ్మిషన్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సు సంబంధించి 6 సెమిస్టర్లు ఉంటాయని, మొత్తం సీట్లు 60 ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఇంగ్లీష్

ఒక సబ్జెక్టుగా ఉత్తీర్ణులై ఉండాలని, ప్రవేశం పూర్తిగా 10వ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. 10ం2 (వీుజ) పూర్తి చేసిన వారు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని, గరిష్టంగా 23 ఏళ్లు ఉండాలని, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్ల అర్హతలు ఉ ఒడాలని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి నెలకు రూ. 2,500/ – స్టైపెండ్ తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పూర్తి వివరాలు klbiiht.telangana.gov.in, ఈమెయిల్ iihthyderabad@gmail.com, 040-29367009 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# పది పరీక్షల కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**నల్గొండ టౌన్, మార్చి 14 (సూర్య సేన) :** ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా పదవతరగతి పరీక్షలు సవ్యంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం పదవతరగతి పరీక్షలు ప్రారంభం కాగా, నల్గొండ జిల్లా కేంద్రం లోని సైంట్ ఆల్ఫాన్స్,నల్గొండ మండలం దోమలపల్లి జెడ్ పి హెచ్ ఎస్,మునుగోడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.

అన్ని కేంద్రాలలో విద్యార్థుల హాజరు,గైర్హాజరు వివరాలను సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు ఏర్పాటు చేయాలని,వేసవి దృష్ట్యా కుండలలో చల్లటి నీరు ఉంచాలని,టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులను ప్రధాన గేట్ వద్ద పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించాలని చెప్పారు. ప్రశ్నపత్రాలు,జవాబు పత్రాల డిపాజిట్ ను పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని ఆదేశించారు.పరీక్ష కేంద్రాలవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని,పరీక్ష కేంద్రంలోకి ఇతరులేవరు వెళ్లకుండా చూడాలని అన్నారు.పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జీరాక్స్ కేంద్రాలు మూసివేసేలా నిర్ధారణ చేసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ జరగరాదని,పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు.

# బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చలో ఇందిరా పార్క్...




భానుపురి, మార్చి 14 (సూర్య సేన): నేడు (ఆదివారం) జరగబోయే బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఫీజు పోరు దీక్ష నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో "చలో ఇందిరా పార్క్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. అలాగే ఈనెల 15 (ఆదివారం) జరగబోయే ఫీజు పోరు దీక్ష -- చలో ఇందిరా పార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బీసీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు భారత్ గౌడ్, గణేష్ ముదిరాజ్, నరేష్, విక్రమ్, మహేష్, వంశీ, రోశయ్య, పాల్గొన్నారు.

# ఎంపీ వేం నరేందర్ రెడ్డికి పేట కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి 14 (సూర్య సేన) :** ఇటీవల రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ని శనివారం హైదరాబాదులో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, టిపిసిసి కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ లు కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రపంచ శాంతి కొరకు యుద్ధం అపాలని ప్రత్యేక ప్రార్థనలు



**కోదాడ ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) :** నయా నగర్ బాప్టిస్ట్ చర్చిలోని 40 రోజుల ఉపవాస ప్రార్థన దీక్షలో భాగంగా 22వ రోజు ప్రపంచంలో శాంతిని కోల్పబడాలని అమెరికా ఇరాన్ యుద్ధం ఆగిపోవాలని పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మిడిలిస్ట్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల వల్ల ప్రపంచ దేశాలు నిత్యావసర సరుకుల విషయాల్లో ఆరోగ్య విషయాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మానవతా దృక్పథంతో విదేశాల మధ్య యుద్ధం ఆగిపోవాలని ప్రపంచ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకమైన ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థన కూడికలో పెద్దలు స్త్రీలు పిల్లలు యవనస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో కోటయ్య జాను జగ్గు నాయక్ శారా మోజస్ రాంబాబు మౌనిక సువార్తమ్మ గురమ్మ సలోమి సునీత తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ కొరత లేదు.....



**– అవాస్తవ వార్తలు నమ్మవద్దు**

**– రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి, మార్చి 14 (సూర్య సేన) :** రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని రంగారెడ్డి జిల్లాలో ఎల్పిజి గ్యాస్ కొరత లేదని జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని వదంతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో చమురు, ఎల్పిజి గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ఎల్పిజి గ్యాస్ కొరత ఏర్పడిందని వస్తున్న వార్తలు ప్రజలు నమ్మవద్దని యుద్ధ ప్రభావం వలన జిల్లాలలో ఎలాంటి ఎల్పిజి గ్యాస్ కొరత లేదని ఇంతకుముందు గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత సరఫరా ఉన్నట్లే ప్రస్తుతం కూడా అదే విధంగా గ్యాస్ సరపర ఉంటుందని ఎలాంటి జాప్యం ఉండదని జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్కు ఎలాంటి కొరత లేదని అదే విధంగా ఆసుపత్రులు విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాధ శరణాలయాలు వృద్ధాశ్రమాల వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని తెలుపుతూ జిల్లా ప్రజలు గ్యాస్ పై వస్తున్న అవాస్తవాలను వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి...



**– విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలి**

**– మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సూర్యాపేట జిల్లా బీసీ జేఏసీ కన్వీనర్ భద్రబోయిన సైదులు**

**ఎర్రవల్లి, మార్చి 14 (సూర్య సేన) :** తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ని శనివారం ఎర్రవల్లి నివాసంలో సూర్యాపేట జిల్లా బీసీ జేఏసీ కన్వీనర్ భద్రబోయిన సైదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరు-- ఏడు నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు రూ.9 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల పేద విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతున్నదని పేర్కొన్నారు. రేపు జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో

ఈ సమస్యను ప్రస్తావించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కేసీఆర్ ని సైదులు కోరారు.

అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీలను ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన తెలిపారు. ప్రతి మండలానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్

ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎక్కడా పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ విద్యార్థులు మరియు నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్నారని, వాటిపై తగిన చర్యలు తీసుకునేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తామని తెలిపారు.

# అప్పన్నపేటలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**గరిడేపల్లి ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ నందిపాటి కవిత--జానయ్యతో కలిసి శనివారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యర్రగొర్ల మదర్, వార్డు సభ్యులు పోటు సైదులు, పోలే స్వామి, గౌతమి, సరిత, మాజీ సర్పంచులు ఎడవెల్లి చంద్రారెడ్డి, రెడబోతు సత్యవతి వెంకటరెడ్డి, గుణగంటి బిక్షం, బత్తిని అంజయ్య, గుర్రం చిన్న నర్సిరెడ్డి, ఎడవెల్లి బాలసైదులు, బిజ్జాల వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, నందిపాటి వినోద్, రామకృష్ణ, వెంకన్న, నర్సిరెడ్డి, సైదులు, కోట శ్రీకాంత్, గోపిరెడ్డి నర్సిరెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్ తో హైకోర్టు లాయర్ మృతి...



సూర్యాపేట, మార్చి 14 (సూర్య సేన): సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన, హైకోర్టు లాయర్ మహమ్మద్ బడే సాహెబ్(45) శనివారం బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. విధుల నిర్వహణలో భాగంగా హైదరాబాదులో ఉంటున్న బడే సాహెబ్ అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో బంధువులు హైదరాబాద్ ఎల్బీనగర్ కామినేనికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు లాయర్లు, స్నేహితులు బంధువులు సంతాపం వ్యక్తం చేశారు.

సూర్యసేన

ఆదివారం, మార్చి 15, 2026

# ఫుడ్ డెలివరీలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్పీజీ సంక్షోభం




ముంబై, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి): పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే రెస్టారెంట్లు, చిన్న చిన్న హోటళ్లు ఎల్పీజీ గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి కొన్ని రంగాలలో ధరలు పెరుగుదల, తక్కువ ఉత్పత్తి లాంటి ఆందోళనలను రేకెత్తిస్తోంది. అయితే, ఈ సంక్షోభం ఫుడ్ డెలివరీ రంగంపైనా ఎక్కువగా ఉందని, పూర్తిగా ఈ రంగం కార్యకలాపాలు దెబ్బతినేల ఉన్నాయని గిగ్ వర్కర్స్ యూనియన్ చెబుతోంది. దీనికి సంబంధించి గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్(జీఐపీఎస్‌డబ్ల్యూయూ) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

ఎల్పీజీ గ్యాస్ కొరత ఎక్కువ సమస్యను సృష్టించింది. దీనివల్ల డెలివరీ ఏజెంట్లకు పనుల్లేవని పేర్కొంది. రెస్టారెంట్లు, ధాబాలు, క్లౌడ్ కిచెన్‌లు, క్యాటరింగ్ సేవలు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు తమ దుకాణాలను మూసేయాల్సి వచ్చింది. ఇప్పటికే జొమాటో, స్విగ్గీ లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ఆర్డర్లు 50-60 శాతం క్షీణించాయి. డెలివరీ ఏజెంట్ల నుంచి తమకు పెద్ద ఎత్తున ఎంక్వైరీలు వస్తున్నాయి. రోజుకు 30 డెలివరీలు చేసే ఉద్యోగులు కూడా ఇప్పుడు 5-10 మాత్రమే చేస్తున్నారు. డెలివరీలు తగ్గిపోవడం వల్ల కంపెనీలు కూడా ఏజెంట్ల ఐడీలను ఇన్-యాక్టివ్ చేసే ప్రమాదం ఉంది.

దీని పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని యూనియన్ తెలిపింది. గిగ్ కార్మికులకు స్థిరమైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లేవని, సరఫరా షాక్‌లు, ఆర్థిక అంతరాయాల సమయంలో వారు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అత్యవసర జోక్యం కోరుతూ కేంద్ర కార్మిక శాఖకు లేక రాశామని యూనియన్ పేర్కొంది.

అందులో ప్రధానంగా ఆహార వ్యాపారాలకు 24 గంటల ఎల్పీజీసీ సరఫరా, జొమాటో, స్విగ్గీ, ఇతర ప్లాట్‌ఫారమ్‌లు డెలివరీ ఏజెంట్లకు రూ. 10,000 తక్షణ పరిహారం చెల్లించాలని, వారి ఐడీలపై 3 నెలల మారటోరియం, రోజువారీ ప్రోత్సాహకాలు, సామాజిక భద్రత కోడ్-2020 కింద పూర్తి గిగ్ వర్కర్ కవరేజ్ ఇవ్వాలని డిమాండ్ చేసింది.


# ఒరాకిల్‌లో ఉద్యోగాల కోత!?




ముంబై, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి): బృంద సభ్యుల సామర్థ్యాలను పెంచడంలో కృత్రిమ మేధ (ఏఐ)కు క్రెడిట్ ఇవ్వడంతో పాటు, డేటా కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు నిధులు సమకూర్చుకోవడానికి ఒరాకిల్ సిద్ధమైంది. ఇందులో భాగంగా రాబోయే నెలల్లో ఉద్యోగులను తగ్గించడానికి సన్నాహాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. లారీ ఎల్లిసన్ స్థాపించిన ఈ డేటాబేస్ గ్రూప్ పునర్నిర్మాణ వ్యయాల కోసం, అదనంగా 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,600 కోట్ల)ను కేటాయించినట్లు ఇటీవల త్రైమాసిక ఆదాయ నివేదిక తర్వాత యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమాచారమిచ్చింది. దీంతో ఆర్థిక సంవత్సరానికి దాని పునర్నిర్మాణ నిధులు 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.19,320 కోట్ల)కు చేరాయి. ఇది మునుపటి సంవత్సరాల కంటే చాలా ఎక్కువ.

దీని ప్రకారం చూస్తే ఒరాకిల్ వేల మంది ఉద్యోగులను తగ్గించొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. భారీ ఏఐ డేటా కేంద్రాలను నిర్మించే ప్రణాళికలపై ఒరాకిల్, పెట్టుబడిదార్ల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటోంది. దీనికి రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వచ్చే త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించకుండా ఒరాకిల్ పునర్నిర్మాణ ప్రణాళిక పరిధిని 500 మిలియన్ డాలర్లకు పెంచలేదని ఆర్‌బీసీ విశ్లేషకుడు రిషి జలూరియా అభిప్రాయపడ్డారు. తరచుగా ఉద్యోగుల తొలగింపులకు కోడ్‌గా ఉండే పునర్నిర్మాణం ఈ ఆర్థిక సంవత్సరం ముందు కంటే విస్తృతంగా ఉండొచ్చని ఒరాకిల్ సంకేతాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది ఆగస్టు-సెప్టెంబరు మధ్య ఒరాకిల్ అమెరికా, కెనడా, భారత్‌లలో 3,000 మందికి పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. సేల్స్, మార్కెటింగ్‌లో మధ్య స్థాయి ఉద్యోగులను తొలగించిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. తాజా లేఆఫ్‌లు ఏ విభాగంలో ఉండనున్నాయి? ఎంత మందిని తొలగించే అవకాశం ఉంది. తదితర వివరాలు తెలియాల్సి ఉంది. వేలమంది ఉద్యోగులను తొలగించడానికి ఒరాకిల్ ప్రణాళిక సిద్ధం చేస్తోందని బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. ఒరాకిల్ దీనిపై స్పందించలేదు.

# ఘనంగా అభినవ్, అభినందన్ గౌడ్ ల జన్మదిన వేడుకలు...



మోతే, మార్చి 14 (సూర్య సేన) : సూర్యాపేట జిల్లా మోతే మండల పరిధిలోని కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన మోతే మండల ప్రజాగర్జన న్యూస్ ప్రతినిధి కటికం రమేష్, కవిత కుమారులు జన్మదిన వేడుకలు ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కటికం వెంకన్న,బాలకృష్ణ, సురేష్ ,నిహాల్ గౌడ్ నారాయణ బంధుమిత్రులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



హుజూర్నగర్ ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుజూర్నగర్ మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేడి సునీత రమణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యం, మహిళల వైద్యం, దంత వైద్యం, ఎముకల వైద్యం, కంటి వైద్యం, చిన్నారుల వైద్య నిపుణులు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులను పరీక్షించారు.

అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 215 మంది రోగులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చలమల సతీష్, గ్రామ పెద్దలు రాఘవయ్య, పద్మ, పద్మ (పర్యవేక్షకురాలు), ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం

## - అనంతగిరి మండల మాజీ ఎంపీపీ








అనంతగిరి ప్రతినిధి, మార్చి 14 (సూర్య సేన) : ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి మారెమ్మ గుడి దగ్గర గల అమ్మ ఫంక్షన్ హాల్ నందు ఈరోజు జరిగినఅనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామానికి చెందిన కోదాడ నియోజకవర్గం మత్య సహకార సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి వెంకన్న రాజకుమారిల ఏకైక కుమార్తె లావణ్య వేణుల వివాహ వేడుకలలో వాయిలసింగవరం  మండల నాయకులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి ,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి వాయిల సింగవరం ఉప సర్పంచ్ ఉమాదేవి నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ కార్యదర్శి వీరబోయిన నాగరాజు, బుర్ర పెద్ద గొల్ల వెంకన్న, వీరబోయిన సైదులు  నాగ శేషు, బుర్ర పవన్, తదితరులు పాల్గొన్నారు...

# 3.21 శాతానికి పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం



ముంబై, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి): దేశ రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి వినియోగదారుల ధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం(సీపీఐ) 3.21 శాతానికి చేరుకుంది.

దీనికి ప్రధానంగా అంతర్జాతీయంగా వాణిజ్య, భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావంతో పాటు కీలక ఆహారపదార్థాలు, దుస్తులు, వినియోగ వస్తువుల ధరలు పెరగడమే కారణం. ఈ మేరకు కేంద్ర గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) గురువారం డేటాను విడుదల చేసింది.

# రూ.49,999 కే టీవీఎస్ ఎలక్ట్రిక్ స్కూటర్




ముంబై, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి): టీవీఎస్ మోటార్ కంపెనీ తన సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్ ద్వారా భారత ఈవీ మార్కెట్లో సరికొత్త విప్లవానికి తెరలేపింది. పెట్రోల్ ధరల భారం పెరుగుతున్న తరుణంలో, సామాన్యుడికి అందుబాటులో ఉండేలా బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్ అనే వినూత్నమైన సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల వినియోగదారులు స్కూటర్ కొనేటప్పుడు బ్యాటరీ ధరను చెల్లించాల్సిన అవసరం లేదు. ఫలితంగా, టీవీఎస్ ఆర్బిటర్ వీ1 బేస్ వేరియంట్‌ను కేవలం ?49,999 (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) ప్రారంభ ధరకే సొంతం చేసుకోవచ్చు. ఒకవేళ మీరు బ్యాటరీని కూడా కొనుగోలు చేయాలనుకుంటే, ఈ స్కూటర్ ధర ?84,500 గా ఉంటుంది. ఈ స్కీమ్ కింద బ్యాటరీ కోసం నెలకు కేవలం రూ. 862 నుండి ప్రారంభమయ్యే అద్దె ప్లాన్లను కంపెనీ ఆఫర్ చేస్తోంది. దీనివల్ల స్కూటర్ కొనుగోలు చేసేటప్పుడు అయ్యే ప్రారంభ పెట్టుబడి గణనీయంగా తగ్గుతుంది. సాంకేతిక వివరాల్లోకి వెళితే, టీవీఎస్ ఆర్బిటర్ ప్రధానంగా రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. ఆర్బిటర్ వీ1 మోడల్ 1.8 నెచిష్ట్ర బ్యాటరీతో వస్తుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 86 కిలోమీటర్ల (ఎఆఅ) రేంజ్ ఇస్తుంది. ఇక ప్రీమియం మోడల్ అయిన ఆర్బిటర్ వీ2 ధరను కంపెనీ 99,900 గా నిర్ణయించింది. ఇందులో అమర్చిన 3.1 నెచిష్ట్ర భారీ బ్యాటరీ ద్వారా ఏకంగా 158 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చు. ఈ రెండు స్కూటర్లలోనూ 34 లీటర్ల విశాలమైన 'అండర్ సీట్ స్టోరేజీ' ఉంది, ఇది రెండు హెల్మెట్లు పెట్టుకోవడానికి వీలుగా డిజైన్ చేయబడింది. అదనంగా, ఈ స్కూటర్లకు 5 ఏళ్లు లేదా 70,000 కిలోమీటర్ల వరకు బ్యాటరీ వారంటీని కంపెనీ అందిస్తోంది. వినియోగదారులకు బ్యాటరీ లైఫ్, అలాగే నిర్వహణపై పూర్తి భరోసాను ఇస్తుంది. ఈ స్కూటర్ కేవలం బడ్జెట్ ధరకే పరిమితం కాకుండా, అత్యున్నత సాంకేతిక ఫీచర్లతో నిండి ఉంది.

ఇందులో 5.5 అంగుళాల ఎల్‌సీడీ క్లస్టర్ ఉంది. ఇది స్మార్ట్‌కనెక్ట్ యాప్ ద్వారా బ్లూటూత్ కనెక్టివిటీని అందిస్తుంది. దీని ద్వారా కాల్, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు, టర్న్ బై టర్న్ నావిగేషన్ వంటి సదుపాయాలను రైడర్ పొందవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా, టీవీఎస్ ఇందులో వాట్సప్ ద్వారా పేరెంట్ కంట్రోల్ అనే ప్రత్యేక ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు స్కూటర్ నడిపేటప్పుడు వారి ప్రయాణాన్ని పర్యవేక్షించవచ్చు. హిల్ హోల్డ్ అసిస్ట్, క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ పార్క్ అసిస్ట్ వంటి ఫీచర్లు నగర ట్రాఫిక్‌లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయి.

# ధరలను పెంచిన ఆడి ఇండియా



ముంబై, మార్చి, 14 (సూర్యసేన ప్రతినిధి): ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా తన కార్ల ధరలను పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది.

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అన్ని కార్ల ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు తెలిపింది. వాహనాల తయారీలో కీలకమైన ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, కరెన్సీ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని పాక్షికంగానైనా భర్తీ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ వివరణ ఇచ్చింది. ధరల పెంపు విధానం కారు మోడల్, వేరియంట్‌ను వేర్వేరుగా ఉంటుందని, కార్ల ఎక్స్-షోరూమ్ ధరలపై ఈ పెంపు అమలవుతుందని ఆడి ఇండియా డైరెక్టర్ బల్బీర్ సింగ్ దిల్లో స్పష్టం చేశారు. ఇప్పటికీ కస్టమర్లపై ఖర్చుల భారం తగ్గించేందుకు కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నారు.

# తెలుగు హీరోయిన్లకు...
# తమిళ దెబ్బ




టాలీవుడ్లో మంచి గుర్తింపు వచ్చిన హీరోయిన్లు కోలీవుడ్లోకి, అక్కడ మంచి క్రేజ్ సంపాదించుకున్న వారు మన తెలుగులోకి రావడం అనేది అనేక సంవత్సరాలుగా జరుగుతోంది.ఇక్కడ, అక్కడ ఏకకాలంలో స్టార్ హీరోయిన్లుగా చక్రం తిప్పిన వారు కూడా అనేకమంది ఉన్నారు. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమలో మంచి క్రేజ్ కలిగిన హీరోయిన్లుగా కొనసాగుతున్న ఇద్దరు ముద్దుగుమ్మలకు కోలీవుడ్ సినిమాల ద్వారా గట్టి షాక్ తగిలింది. ఇంతకు ఆ ఇద్దరు యంగ్ హీరోయిన్లు ఎవరు అనుకుంటున్నారా? వారు మరెవరో కాదు కృతి శెట్టి, శ్రీలీల. కృతి శెట్టి 'ఉప్పెన' మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే సూపర్ విజయాన్ని, అంతకుమించిన గుర్తింపును సంపాదించుకుంది. ఆ తర్వాత వరుస పెట్టి చాలా సినిమాలలో అవకాశాలను దక్కించుకుంది. కానీ ఈమెకు చాలా కాలం నుండి సరైన విజయాలు లేవు. దాంతో ఈ బ్యూటీ తెలుగుతోపాటు ఇతర భాష సినిమాలపై కూడా ఆసక్తి చూపించడం మొదలు పెట్టింది. అందులో భాగంగా కోలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. తాజాగా కృతి, కార్తీ హీరోగా నటించిన వా వాతియర్ అనే తమిళ సినిమాలో నటించింది.

## డెకాయిట్‌పై ఎక్స్‌పెక్టేషన్స్ పెంచేసిన హీరో కామెంట్స్



బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో అలరిస్తున్న హీరో అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గ్‌డ్ పాత్రలో కనిపించనున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 10న రాబోతున్నది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా.. షూటింగ్ పూర్తి చేసుకన్న సదర్భంగా సినిమా విశేషాలు పంచుకున్నాడు అడివి శేష్. 'డెకాయిట్ ఒక కొత్త జోనర్‌లో చేసిన సినిమా. ఈ మధ్యకాలంలో మనం లవ్ స్టోరీస్ చెప్పడం మానేశాము. ఈరోజుల్లో అందరూ ఒక మంచి లవ్ స్టోరీ కోరుకుంటున్నారు. ఈ రోజుల్లో లవ్ స్టోరీనే యూనిక్. ఇది థ్రిల్లింగ్ యాక్షన్‌లో చెప్పిన లవ్ స్టోరీ. ఒక కొత్త జోనర్లో చేసిన ప్రయోగం. కథలో అవసరం ఉందంటే నేను ఏదైనా చేస్తాను. ఇందులో రుబారూ కూడా కథలో ఆ క్యారెక్టర్‌కి అవసరమైన సాంగ్. ఈ సినిమా అందరినీ ఎక్సయిట్ చేస్తుంది. సినిమా చివరకు వచ్చేసరికి అందరూ ఎమోషన్ అవుతారు. ఫ్యామిలీస్‌తో కలిసి చూడదగ్గ ఒక జెన్యూన్ ఫిలిమ్' అని చెప్పుకొచ్చాడు.


# మరోసారి అందాలతో ఎటాక్



మోస్ట్ బ్యూటిఫుల్ నటి సాక్షి అగర్వాల్ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు. ఈమె ఎక్కువ శాతం తమిళ సినిమాల్లో నటించింది. ఆ తర్వాత కన్నడ, మలయాళ చిత్రాల్లో నటించింది. 2013లో వచ్చిన రాజా రాణి చిత్రంతో ఈ ముద్దుగుమ్మ వెండితెరకు పరిచయం అయింది. అంతకుముందు పలు టీవీ షోలలో పార్టిసిపేట్ చేసి బుల్లితెర అభిమానులను బాగానే సంపాదించుకుంది. ఈమె ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా సంవత్సరాలు అవుతున్నా చాలా తక్కువ సినిమాల్లోనే నటించింది. ఈ బ్యూటీ సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా అభిమానులను మాత్రం బాగానే సంపాదించుకుంది. సాక్షి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేస్తూ రోజురోజుకు తన ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటూ వస్తుంది.ఈ బ్యూటీ ఇప్పటికీ అనేకసార్లు తన సోషల్ మీడియా అకౌంట్లో హాట్ ఫోటోలను పోస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అందులో చాలా వరకు వైరల్ కూడా అయ్యాయి. దానితో



ఈమెకు ఓ స్టార్ హీరోయిన్ రేంజ్లో ఫాలోవర్స్ ఏర్పడ్డారు. తాజాగా ఈ బ్యూటిఫుల్ నటి తన 'ఇన్ స్టా'లో కొన్ని హాట్ లుక్లో ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది. సాక్షి అగర్వాల్ తాజాగా ఉల్లిపొరలాంటి లైట్ బ్లూ కలర్ శారీని కట్టుకొని, గోల్డ్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌజ్ను ధరించి తన బ్యాక్ అందాలు ఫోకస్ అయ్యేలా ఉన్న ఫోటోలను తన ఇన్ స్టా అకౌంట్లో పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో ఈ ముద్దుగుమ్మ ఎక్సలెంట్ గా ఉండడంతో ప్రస్తుతం ఈ నటికి సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు అనేకమంది బ్యూటిఫుల్, ఆసమ్, లవ్, ఫైర్ ఎమోజీలను కామెంట్లుగా పెడుతున్నారు.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com

www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE,
PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com